రెవెన్యూ మాయాజాలం

● ప్రభుత్వ స్థలాలు దర్జాగా కబ్జా ● కబ్జా స్థలాల్లో పెద్ద భవంతుల నిర్మాణం



రాయచోటిలోని రవ్వలగుట్టలో అక్రమ నిర్మాణాలు



భూఅక్రమార్కులకు కళ్లెం వేయాలి..



రాయచోటి జిల్లా కేంద్రం అయింది కాబట్టి ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టేందుకు చాలా భూమి అవసరం ఉంది. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిని చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు జిల్లా స్థాయి అధికారులు చొరవ చూపాలి. రాయచోటిలో ప్రభుత్వ భూమి చాలా ఉండేది. ఇప్పుడు అ భూమి రియల్ ఎస్టేట్ వారి చేతుల్లోకి పోయి మొత్తం అన్యాక్రాంతం అయిపోయింది. ఇక్కడికి వచ్చే ప్రతి అధికారి రియల్‌ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయి రాయచోటిని భూఅక్రమార్కులకు అడ్డాగా మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు అందరూ మామూళ్లకు అలవాటు పడడం వల్లే పరిస్థితి ఇలా తయారైందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. 2019 వరకు పట్టణంలో ప్రభుత్వ స్థలాలు చాలా వరకు ఖాళీగా ఉండేవి. ప్రస్తుతం పూర్తిగా కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోయాయి. ఇక్కడికి వచ్చే వీఆర్‌వోలు మామూళ్లు తీసుకుని వారికి నచ్చిన స్థలంలో పునాదులు వేసుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. పత్రికల్లో కబ్జాలపై వార్తలు వచ్చినప్పుడు మాత్రమే రెవెన్యూ వారు హడావుడి చేస్తారు. కూటమి ప్రభుత్వంలో అయినా ప్రభుత్వ స్థలాలను కాపాడాలి.

- సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 28 : జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రభుత్వ భూములు రోజురోజుకు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను రేటు పెట్టి అమ్ముకున్నారనే ఆరోపణలు వచ్చాయి. వీఆర్‌వోల దగ్గర నుంచి తహసీల్దార్ వరకు అందరూ రాయచోటికి పోస్టింగ్‌లు వేయించుకుని తమ మాయాజాలంతో రికార్డులను తమకు అనుకూలమైన వారి పేరు మీద మార్చేసి జేబులు నింపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకప్పుడు (2001) ఈ కార్యాలయంలో రైతుకు పాసుబుక్కు ఇవ్వాలంటే రూ.2 వేలు లంచం తీసుకోవడానికి తహసీల్దార్ తిరుపతికి వెళ్లి అక్కడే తీసుకునేవాడని అప్పుడు పనిచేసిన రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో పనిచేసిన ఓ తహసీల్దార్ పాసుబుక్కుకు కనీసం లక్ష రూపాయలు వసూలు చేయండి అని ఆదేశాలు ఇచ్చేవారని అప్పట్లో ప్రచారం జోరుగా సాగింది. ఇదే అదునుగా తీసుకున్న రెవెన్యూ అధికారులు అప్పటి నుంచి రాయచోటిలో పోస్టింగ్‌ల కోసం చోటామోటా నాయకుల చుట్టూ తిరిగి వారు అడిగినంత డబ్బులు ఇచ్చి ఇక్కడికి ఉద్యోగం వేయించుకుని ఉన్నంతకాలం అందినకాడికి దోచుకుని అనంతరం గుట్టుచప్పుడు కాకుండా పక్క మండలాలకు బదిలీలపై వెళ్లిపోతున్నారు. 2011-14 వరకు ఉన్న తహసీల్దార్‌ను అడ్డుపెట్టుకుని ఓ ఆర్ఐ మండలంలోని ప్రభుత్వ భూములను ఇష్టానుసారం ఆన్‌లైన్ చేసి కోట్లలో అక్రమ సంపాదనకు పాల్పడ్డాడని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. 2014లో వచ్చిన తహసీల్దార్ నాయకుల మాట వినడం లేదని అయనను ఏడాది తిరగక ముందే పంపించేశారు. ఆ తరువాత వచ్చిన బలమైన సామాజికవర్గానికి చెందిన ఓ తహసీల్దార్ మున్సిపాలిటీలో ఉన్న డీకేటీ భూములను చోటామోటా నాయకులకు ఆన్‌లైన్ చేసి రూ.50 కోట్లు సంపాదించాడని, ఒక సర్వే నెంబర్‌లో పెద్ద మొత్తంలో బేరం కుదుర్చుకుని ఏవో కారణాల వల్ల పని పూర్తి కాకపోవడంతో రూ.25 లక్షలు తిరిగి ఇచ్చేశాడని ప్రచారం జరిగింది. తర్వాత వచ్చిన తహసీల్దార్ కూడా అదే బాటలోనే నడిచి కోట్లాది రూపాయలు సంపాదించాడని అరోపణలు ఉన్నాయి. రాయచోటిలో ప్రభుత్వ భూములు అక్రమించాలంటే రెవెన్యూ అధికారులకు మామూళ్లు ముట్టచెప్పి తరువాత ఆక్రమణదారులు సీన్‌లోకి వెళుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి ఏజీ గార్డెన్, శుభకతుల్లా కాలనీ, రవ్వల గుట్ట, బిజిలిగుట్ట, తదితర ప్రాంతాల్లో ఒక్కో ప్లాట్‌కు 3-5 లక్షలు గుట్టుచప్పుడు కాకుండా వీఆర్‌వోల ద్వారా రెవెన్యూ సిబ్బంది మామూళ్లు తీసుకున్నారని కొందరు బహిరంగంగానే చెబుతున్నారు. రవ్వలగుట్ట దగ్గర పునాదులు వేస్తున్న ఓ వ్యక్తి నుంచి ఓ వీఆర్‌వో పెద్దమొత్తంలో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2007లో ఈ ప్రాంతంలో దాదాపు 500 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉండేవి. 2024 వచ్చేసరికి 57 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. మిగిలిన భూమి అంతా రియల్‌ఎస్టేట్ వారి చేతుల్లోకి వెళ్లిపోయిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అస్తులు అక్రమించిన వారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణాలోపం

రాయచోటి జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి మున్సిపాలిటీ పరిధిలో భూకబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శని, ఆదివారాలలో మాత్రమే పునాదులు వెలుస్తున్నాయి. వీరబల్లి, సుండుపల్లి, లక్కిరెడ్డిపల్లి, చిన్నమండ్యం ప్రాంతాలకు చెందిన వారు ఏదో ఒక అధికారి పేరు చెప్పి దర్జాగా పునాదులు వేసేస్తున్నారు. అసలు వీరికి పట్టాలు ఎవరు ఇచ్చారు, ఏ ఆధారంతో ఇళ్లు కడుతున్నారు, వీరి వెనుక ఉన్నది ఎవరు అన్న విషయాలు ఇప్పుడు అందరినీ ఆలోచింపచేస్తున్నాయి. గతంలో ఇక్కడికి వచ్చిన తహసీల్దార్లు సీటు వదిలి బయటికి రాకపోవడం, క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతోంది అని వీఆర్‌వోలను గట్టిగా మందలించకపోవడం వల్లే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు..

ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు. నేను ఇక్కడికి కొత్తగా వచ్చాను. ఇక్కడ జరిగిన విషయాలపై నాకు పూర్తిగా అవగాహన లేదు. రెండు రోజుల క్రితం అక్రమ కట్టడాలు చేపడుతున్నారని సమాచారం రావడంతో వెంటనే వెళ్లి వాటిని ఆపించేశాము. ఎటువంటి ఆధారాలు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- ఎం.పుల్లారెడ్డి, తహసీల్దార్, రాయచోటి

ర్యాగింగ్ భూతం మింగేసింది!

● కలికిరి జేఎన్టీయూ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

● స్వస్థలం కడప జిల్లా ఖాజీపేట మండలం మల్లాయపల్లె

● సీనియర్ విద్యార్థులు వేధించారనే ఆరోపణలు

● కలికిరి పోలీసులతో కలిసి దర్యాప్తు చేస్తున్న మైదుకూరు పోలీసులు



ఇంజనీరింగ్ విద్యార్థి ప్రవీణ్ (ఫైల్)

కలికిరి/మైదుకూరు రూరల్, ఆగస్టు 29: తండ్రి మెకానిక్ పనిచేస్తూ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తున్నాడు. పెద్ద కుమారుడు బీటెక్ పూర్తి చేయగా రెండో కుమారుడు బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పిల్లల చదువు పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. ఎన్నో ఆశలతో కలికిరి జేఎన్టీయూలో రెండో సంవత్సరం బీటెక్‌లో చేరిన చిన్న కుమారుడు ప్రవీణ్ (19) కళాశాలలో చేరిన మూడు రోజులకే హాస్టల్‌లో సీనియర్లు చేసిన ర్యాగింగ్ భూతానికి బలయ్యాడని తల్లిదండ్రులు రోదిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా ఖాజీపేట మండలం మల్లాయపల్లెకు చెందిన నంద, వసంత దంపతులు తమ స్వగ్రామం నుంచి మైదుకూరు మండలం జీవీ సత్రం వెళ్లి మెకానిక్‌గా పనిచేస్తూ స్థిరపడ్డారు. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు బీటెక్ పూర్తి చేయగా చిన్నకుమారుడు ప్రవీణ్ పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కాలేజీలో పాలిటెక్నిక్ పూర్తి చేశాడు. ఇంజనీరింగ్ చేసేందుకు ఈ-సెట్‌లో ర్యాంకు తెచ్చుకున్నాడు. మూడో విడత కౌన్సెలింగ్‌లో కలికిరిలోని జేఎన్‌టీయూలో సీటు వచ్చింది. బీటెక్ (మెకానికల్) రెండో సంవత్సరంలో ఈ నెల 12న చేరి ఈనెల 20వ తేదీ కళాశాలకు వచ్చి మూడు రోజులపాటు తరగతులకు హాజరయ్యాడు. హాస్టల్‌లో ర్యాగింగ్ ఎక్కువగా ఉండటంతో భయపడి 23వ తేదీ ఇంటికి వచ్చాడు. అదే విషయం ఇంట్లో చెప్పాడు. అయితే ర్యాగింగ్ అనేది మామూలేనని, కాలేజీకి వెళ్లాలని ఇంట్లో వాళ్లు చెప్పడంతో కొన్నిరోజుల తర్వాత వెళతానని వారికి సమాధానం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. బుధవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ప్రవీణ్‌ను కుటుంబ సభ్యులు మైదుకూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం డిస్చార్జ్ చేశారు. ఇంటికి వచ్చిన కాసేపటికే పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. అయితే అక్కడ వైద్యులు బతకడని చెప్పి అడ్మిట్ చేసుకోలేదు. దీంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి వచ్చి తెల్లవారుజామున చేర్పించగా వెంటనే అతను మృతి చెందాడు. హాస్టల్‌లోని సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసిన కారణంగానే ప్రవీణ్ బలవన్మరణానికి పాల్పడ్డట్లు ప్రచారం జరుగుతోంది. తన మేనల్లుడు ప్రవీణ్‌ను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసిన కారణంగానే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రవీణ్ మేనమామ గుర్రంకొండ చంద్ర మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మైదుకూరు పోలీసులు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో దర్యాప్తు చేస్తున్నారు. కలికిరి ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డి శేఖర్ రెడ్డి కూడా మైదుకూరు పోలీసులతో కలిసి విచారణ చేస్తున్నారు. కలికిరి పోలీసులతో కలిసి మైదుకూరు పోలీసులు గురువారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సహచర విద్యార్థులను క్షుణ్ణంగా విచారించారు. ప్రవీణ్ ఆత్మహత్యకు ర్యాగింగ్ కారణమా లేదంటే మరేదయినా కారణాలున్నాయా అన్న కోణాల్లో పోలీసులు గురువారం రాత్రి వరకూ కళాశాలలోనే విచారణ జరుపుతున్నారు. ప్రవీణ్ కళాశాలలో చేరి మూడు రోజులు మాత్రమే ఉన్నాడని, ఈ మూడు రోజుల్లోనే ఏమి జరిగి ఉండొచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్ ఎవరితో కలివిడిగా ఉండలేదని, ముభావంగా ఉండేవాడని తోటి విద్యార్థులు చెబెతున్నట్లు తెలిసింది. కొంతమంది సీనియర్ విద్యార్థులు కలుగజేసుకుని ఇలా ముభావంగా వుంటే ఎలాగంటూ చురుగ్గా ఉండాలని ప్రోత్సహించేందుకు మాత్రం ప్రయత్నించినట్లు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఇప్పటి వరకూ ర్యాగింగ్ కారణంగానే ప్రవీణ్ ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తేగానీ అసలు విషయం బయటకు రాదని చెబుతున్నారు.

మా భూములు కబ్జా చేశారయ్యా!

● వైసీపీ పాలనలో భూకబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

● టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరించిన మంత్రి కొండపల్లి

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో వైసీపీ నేతలు తమ భూములు కాజేశారని పలువురు బాధితులు మంత్రికి ఫిర్యాదు చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, పార్టీ నేత నరసింహ ప్రసాద్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూముల రీ సర్వే పేరుతో తమ భూములను తహసీల్దార్ మరొకరి పేరు మీదకు మార్చారని, ఆ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించి తన భూమిని తనకు ఇప్పించాలని అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం మజరా బొంతలవారిపల్లి గ్రామానికి చెందిన బొంతా నరసింహారెడ్డి కోరారు. ఇదే మండలం శోత్రియం జగడం వారి పల్లి గ్రామంలో తమ భూమిని తహసీల్దార్ మరొకరి పేరు మీదకు మార్చారని గూడె పాపిరెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే, రాజకీయ నేతల ప్రోద్బలంతో మండల రెవెన్యూ అధికారులు, అక్రమార్కులు కుమ్మక్కై తమ భూమిని కొట్టేశారని అదే గ్రామానికి చెందిన గుడె శివరామిరెడ్డి, గుడె మంజునాథరెడ్డి ఫిర్యాదు చేశారు. వారందరిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం లేవాకువారిపల్లిలో తన భూమిలో వైసీపీ నేతలు మట్టి తవ్వుకొని అమ్ముకొన్నారని, తనకు న్యాయం చేయాలని నాగినేని వెంకట సుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. దళితులమైన తమకు 1987లో ప్రభుత్వం ఇచ్చిన భూములు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో తమ పేరు మీద ఎక్కలేదని, దీంతో తమకు పథకాలు వర్తించడం లేదని అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఆకేపాడు గ్రామ దళితులు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

సజ్జల నా భూమిని కొట్టేశారు

వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు తన భూమిని కబ్జా చేశారని కడప జిల్లా చింతకొమ్మదిన్నెకు చెందిన బుక్క రాజానాయక్ జనవాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో గురువారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వినతులు స్వీకరించారు. 20 ఏళ్ల క్రితం డీకేటీ పట్టా కింద ప్రభుత్వం మాకు కేటాయించిన 5 ఎకరాల 14 సెంట్ల భూమిని సజ్జల ఎస్టేట్‌లో కలిపేసుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే సజ్జల భూమి పక్కన నీ భూమి ఉండడమే అదృష్టమని అంటున్నారు. అయిన కాడికి అమ్ముకుపొమ్మంటున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా, స్పందనలో ఫిర్యాదు చేసినా స్పందన లేదు. సజ్జల, ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించండి' అని రాజానాయక్ విన్నవించారు. దీంతో మంత్రి కందుల దుర్గేష్ కడప జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి రాజునాయక్ అర్జీ వివరాలు తెలిపారు. దీనిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.



జంగంపల్లె పాఠశాలలో సంప్రదాయ దుస్తుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పీలేరు, ఆగస్టు 29: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని పిల్లలు సంప్రదాయ దుస్తులు ధరించి తెలుగు తల్లి, తెలుగు కవుల వేషధారణలో ర్యాలీలు నిర్వహించారు. తెలుగు భాష తల్లి లాంటిదని, దానిని నిర్లక్ష్యం చేయబోమని నినాదాలు చేశారు. విద్యార్థుల ర్యాలీలతో పీలేరులో పండుగ వాతావరణం నెలకొంది. పీలేరులోని జంగంపల్లె పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో తెలుగు భాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పలమనేరు బాలాజీకి భాషా పురస్కారం



సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న పలమనేరు బాలాజీ

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 29 : ప్రముఖ సాహితీవేత్త పలమనేరు బాలాజీని తెలుగు భాషా పురస్కారం వరించింది. పలమనేరుకు చెందిన వీరు కవిత్వం, కథ, విమర్శా రంగాల్లో విశేష కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు పుస్తకాలు వెలువరించారు. వీరి రచనలు తమిళం, కన్నడం, ఆంగ్లంలోకి అనువాదం అయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గురువారం విజయవాడలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో పలమనేరు బాలాజీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుభాషా పురస్కారం ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. కాగా.. వీరు ప్రస్తుతం పెద్దతిప్పసముద్రం ఎంపీడీవోగా పనిచేస్తున్నారు.

భాష ప్రాచీనతను కాపాడుకోవాలి



● ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలి

● పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

● కళకళలాడిన కలమల్ల

● విజయవంతమైన తెలుగు భాషా దినోత్సవం

ఎర్రగుంట్ల, ఆగస్టు 29: తెలుగు భాష చాలా ప్రాచీనమైనదని, దీని ప్రాచీనతను మనందరం కాపాడుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. తొలి తెలుగు శాసనాలున్న కడప జిల్లా కలమల్లలో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవానికి అయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎర్రగుంట్ల వరకు రైలులో వచ్చిన ఆయన అక్కడి నుంచి రోడ్డు మార్గాన కలమల్లకు చేరుకున్నారు. అక్కడ అధికారులు, ఎన్డీయే నేతలు, తెలుగుదనం ఉట్టి పడే వేషధారణలో చిన్నారులు, జానపద కళాకారులు ఆయనను స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రాచీన సాంస్కృతిక, కవుల, సాహితీవేత్తల, తెలుగు చరిత్రపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను, తొలి తెలుగు శాసనాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ.. ఇంట్లో, వీధిలో, బడిలో, గుడిలో అమ్మఒడిలో, నారుమడిలో మాతృభాషనే మాట్లాడాలన్నారు. సెల్లులు, టీవీలను పరిమితంగా వాడితే ఉపయోగమని, లేదంటే జబ్బులొస్తాయన్నారు. అవసరమైన వరకే ఎలక్ట్రానిక్ మిషనరీని వాడాలని, ప్రతి దానికి గూగుల్‌పై ఆధారపడరాదన్నారు. చివరకు భర్త పేరును కూడా గూగుల్‌లో చూసి చెబుతామనే స్థితికి రాకూడదన్నారు. మన భాష సంస్కృతికి చుక్కాని లాంటిదని, అది మనతో ఆగిపోరాదన్నారు. శాసనాల సంరక్షణకు ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తరప్రత్యుత్తరాలన్నీ తెలుగుభాషలోనే ఇవ్వాలన్నారు. కలమల్ల శాసనాలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు పర్యాటక కేంద్రంగా మార్చాలన్నారు. తెలుగు సాహిత్యానికి ప్రొద్దుటూరు పెట్టింది పేరన్నారు. అందుకు పెన్నా నీరు కారణమై ఉండవచ్చన్నారు. అనేకమంది పండితులు ఈ ప్రాంతంలో ఉన్నారని, గొప్ప గొప్ప సాహిత్యాలు రాశారని తెలుగుభాషకు, తెలుగు రాష్ట్రాలకు గొప్ప పేరు తెచ్చారన్నారు. మనందరం తెలుగువాళ్లం, తెలుగులోనే మాట్లాడుదామని పిలుపునిచ్చారు.

పండితుల గడ్డ కడప : కలెక్టర్

కడప జిల్లాలో ఎంతోమంది పండితులు ఉన్నారని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. పండితుల గడ్డ కడప అన్నారు. సుమతి శతకం రాసిన బద్దెన ఇక్కడి వాడే అన్నారు. సామాన్య ప్రజానీకానికి కూడా అర్థమయ్యే రీతిలో నన్నెచోడుడు, వేమన, మొల్ల.. ఇలా అనేక మంది తెలుగు సాహిత్యానికి విశేషంగా కృషి చేశారన్నారు. తొలి తెలుగు శాసనాలు లభించిన చోటే తెలుగుభాషా దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి పిలవగానే ముఖ్యఅతిథిగా వచ్చిన వెంకయ్యనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక, ఆర్థిక విధానాలపై తెలుగును ఎలా సంస్కరించుకోవాలో ఆలోచించుకోవాలన్నారు. ప్రతి సబ్జెక్టులో తెలుగును ఎలా తీసుకురావాలో ఏ విధంగా తీసుకెళ్లాలో ఆలోచించాలన్నారు.

సాహితీవేత్తలకు సన్మానం

తెలుగుభాషా దినోత్సవంలో భాగంగా కడప జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలను వెంకయ్యనాయుడు సన్మానించారు. శతావధాని నరాల రామారెడ్డి, తవ్వా ఓబుల్‌రెడ్డి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, డాక్టర్ బి.సంజీవమ్మ, షేక్‌హుసేన్ సత్యాగ్ని తదితరులను శాలువా కప్పి, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. అలాగే వెంకయ్యనాయుడును ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ శివశంకర్, భాషోపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఈవో అనురాధ, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతంలో జూదం ఫుల్..!

● చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు ● ఇన్‌ఫార్మర్లతో సమాచారం లీక్





టి.పసలవాండ్లపల్లె-చెర్లోపల్లె సరిహద్దు ప్రాంతంలో ఇటీవల పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు (ఫైల్)

గుర్రంకొండ, ఆగస్టు 29: మండల సరిహద్దు ప్రాంతమైన టి.పసలవాండ్లపల్లె, మర్రిపాడు, శెట్టివారిపల్లె, సంగసముద్రం, తరిగొండ, నడిమిఖండ్రిగ అటవీ ప్రాంతాల్లో జూదం విచ్చలవిడిగా సాగుతోంది. ఈ జూదంలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పేకాటకు అన్నమయ్య జిల్లా నుంచే కాక అనంతపురం, కడప జిల్లాతో పాటు వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జూదరులు వస్తున్నారు. ఈ జూదరులకు పేకాట నిర్వాహకులు ఫోన్ల ద్వారా సమాచారం ఇసున్నారు. ఏ రోజు ఎక్కడ జూదం ఆడేది సెల్‌ఫోన్ ద్వారా నిర్వాహకులు లోకేషన్‌ను షేర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో జూదరులు చడీచప్పుడు లేకుండా అక్కడికి చేరుకుంటున్నారు. ఇలా జూదం గుర్రంకొండ మండలంలో విచ్చలవిడిగా సాగుతోంది. గుర్రంకొండ మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో ఎక్కువగా కొండలు, అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతాన్ని జూదరులు తమ కార్యకలాపాలకు చక్కగా వినియోగించుకుంటున్నారు. అంతేకాకుండా జూదం జరిగే ప్రాంతం వరకు నిర్వాహకులు రెండు మూడు చోట్ల ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. జూదం ఆడుతున్న సమాచారం పోలీసులకు తెలిసి పట్టుకోవడానికి వస్తే నిర్వాహకులు ఏర్పాటు చేసిన వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా సమాచారం ఇస్తారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకునేలోపే జూదరులు అక్కడ నుంచి తప్పించుకుంటున్నారు. పోలీసులను చూసి పరుగెత్తలేని వారు మాత్రమే పట్టుబడుతున్నారు. పోలీసులకు పట్టుబడిన జూదరుల వద్ద అధిక మొత్తంలో సొమ్ము దొరికినా మొత్తం చూపించడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈనెల 9వ తేదీ టి.పసలవాండ్లపల్లె-చెర్లోపల్లె సరిహద్దు ప్రాంతంలో జూదరులపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చిన్నమండెం, పెద్దమండెం, గుర్రంకొండ మండలాలకు చెందిన 12 మంది పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.41,600 నగదు, 20 ద్విచక్ర వాహనాలను కేసులో చూపించారు. అప్పటిలో ఈ పేకాట శిబిరంలో సుమారు 40 మందికి పైగా ఉన్నట్లు, సుమారు రూ.20 లక్షల పైగా నగదు జూదంలో చేతులు మారినట్లు గ్రామస్థులు చర్చించుకున్నారు.

నిర్వాహకులకు అండగా ఇన్‌ఫార్మర్లు

గుర్రంకొండ మండలంలో జూదం నిర్వహించే నిర్వాహకులకు కొందరు దళారులు ఇన్‌ఫార్మర్లుగా ఉన్నట్లు ప్రజలు, గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. దీంతో మండలంలో టి.పసలవాండ్లపల్లె, మర్రిపాడు, శెట్టివారిపల్లె, తరిగొండ, చెర్లోపల్లె, నడిమిఖండ్రిగ, గుర్రంకొండ ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రాగానే ఈ సమాచారాన్ని పోలీసుల ద్వారా కొందరు దళారులు తెలుసుకుని జూదరులకు చేరవేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు జూదం జరిగే ప్రదేశానికి చేరుకునేలోపే జూదరులు పరారవుతున్నారు. ఇందుకు గానూ ఇన్ఫార్మర్లకు కొంత మొత్తంలో నగదు, మద్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా ఇన్‌ఫార్మర్లు ప్రతిరోజూ వేలాది రూపాయలను సొమ్ము చేసుకోవడం విశేషం. ఈ దళారులతో పోలీస్‌స్టేషన్‌లో జరిగే ప్రతి చిన్న సమాచారం బయట వ్యక్తులకు క్షణాల్లో చేరిపోతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది చివరలో జూదరులకు సహకరిస్తూ పోలీసు కదలికలపై నిర్వాహకులకు సమాచారం చేరవేసే ఓ కానిస్టేబుల్‌పై వేటు పడిన విషయం తెలిసిందే. అధికారులు స్పందించి దళారులు, ఇన్‌ఫార్మర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జూదంపై ప్రత్యేక నిఘా ఉంచాం..



మండలంలోని పలు సరిహద్దు గ్రామాల్లో జరిగే జూదంపై నిఘా ఉంచాము. జూదరులకు ఎవరైనా సహకరిస్తునట్లు తెలిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవు. గ్రామాల్లో జూదరుల కదలికలపై నిఘా ఉంచి కట్టడి చేస్తాం. అలాగే నిర్వాహకుల వివరాలను సేకరిస్తున్నాము.

- మధు రామచంద్రుడు, ఎస్ఐ గుర్రంకొండ



మద్యం పరవళ్లు

- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు
- గోవా, కర్ణాటక, తెలంగాణ నుంచి మద్యం కొనుగోలు
- స్థానికంగా అధిక రేట్లకు అమ్మకాలు
- తూతూమంత్రంగా ఎస్ఈబీ అధికారుల తనిఖీలు

పులివెందుల టౌన్, ఆగస్టు 29: పులివెందుల ప్రాంతంలో మద్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం విచ్చలవిడిగా దిగుమతి అవుతోంది. కొంతమంది అక్రమార్కులు గోవా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మద్యాన్ని ఇక్కడకు తెచ్చి అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. ఇక్కడి కంటే అక్కడి ధరలు తక్కువగా ఉన్నందున అక్రమార్కులకు ఈ వ్యాపారం కల్పవృక్షంగా మారింది. కొంతమంది గోవా వెళ్లి నేరుగా మద్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. కొంతమంది అక్కడే ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా మద్యం తెప్పిస్తున్నారు. కొద్ది నెలల క్రితం హర్యానా నుంచి పులివెందులకు అక్రమంగా తెచ్చిన మద్యం పట్టుబడింది. అలాగే పోలీసు ఉన్నతాధికారులు తనిఖీల్లో భారీగా మద్యం దొరకడం తెలిసిందే. ఆ సమయంలో కొంతమంది అక్రమార్కులపై ఎక్సైజ్, పోలీసు అధికారులు కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ ఈ అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలిసింది.



విచ్చలవిడిగా బెల్టుషాపులు

ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి కొందరు విక్రయిస్తుండగా.. మరికొందరు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బాటిళ్లను కొనుగోలు చేసి గ్రామాలకు తరలించి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఈ అక్రమ వ్యాపారం మంచి ఆదాయ వనరుగా మారడంతో గ్రామాలలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రతి గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. కొంచెం పెద్ద గ్రామాలలో అయితే మూడు నాలుగు చోట్ల షాపులు నడుస్తుండడం గమనార్హం. మొత్తమ్మీద పులివెందుల ఎక్సైజ్ పరిధిలో గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. ఒక్కో బెల్టుషాపులో రోజుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు మద్యం విక్రయిస్తున్నారు. ఈ లెక్కన పులివెందుల పరిధిలో లక్షల్లో మద్యం విక్రయస్తున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లోని సిబ్బంది, బెల్టుషాపుల నిర్వాహకులతో కుమ్మక్కై ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని సమాచారం. దీంతో గ్రామాలలో ఏ సమయంలో కావాలన్నా మందు దొరుకుతోంది.

పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ

గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిస్తున్నాయి. దీంతో అక్రమ మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. గ్రామాలలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తుండడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. మద్యం నిత్యం అందుబాటులో ఉండడంతో యువత మద్యం సేవించి గొడవలు పడుతున్నారు. విచ్చలవిడిగా తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదుచేస్తే గొడవకు దిగుతున్నారు. ఇక పలుచోట్ల సారా విక్రయాలు కూడా జరుగుతున్నాయి. కొందరు తయారు చేస్తుంటే, కొందరు పొరుగు నుంచి తెచ్చుకొని విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అక్రమమద్యం, సారా వ్యాపారాన్ని అరికట్టకపోతే గ్రామాలలో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషాపులను నిర్మూలించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలలో, పట్టణాలలో మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. కొద్ది నెలలుగా బెల్టుషాపులపై కేసులు పెడుతున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మద్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేశాం. అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తుంటే ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

\- సబితారెడ్డి, సీఐ, ఎస్ఈబీ, పులివెందుల

భారీగా మద్యం పట్టివేత

- గోవా నుంచి తరలిస్తున్న మద్యంగా గుర్తింపు



మద్యంతో సహా పట్టుబడ్డ వాహనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల టౌన్, ఆగస్టు 29: పట్టణంలోని కదిరి రోడ్డులో ఐచర్ వాహనంలో భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న మద్యంను డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ మద్యం గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. రెండు ఐచర్ వాహనాల ద్వారా అక్రమ మద్యంను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో.. రింగురోడ్డు వద్దకు చేరుకొని.. నిఘా పెట్టగా.. ఒక ఐచర్ వాహన పట్టుబడింది. అయితే అప్పటికే మరో ఐచర్ వాహనం, మూడు వాహనాలు మిస్ అయి కడప రోడ్డుకు వెళ్లినట్లు సమాచారం. పట్టుడిన ఐచర్ వాహనంలో వివిధ బ్రాండ్లకు చెందిన మద్యంతో నిండి ఉండగా.. దానిపై ప్లైవుడ్ షీట్లుపెట్టి తరలిస్తున్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. వాహనంతో పాటు డ్రైవర్‌ను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), ఆగస్టు 29: ఉద్యోగ రీత్యా విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. గురువారం పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు సంక్షేమ ఆసుపత్రిలో జైడస్ హెల్త్‌కేర్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక లివర్ ఫైబ్రో స్కాన్ (కాలేయ పనితీరు) పరీక్షలను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమంలో భాగంగా ఖరీదైన లివర్ ఫైబ్రో స్కాన్ పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెప్టెంబరు 3,4 తేదీల్లో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో 45 సంవత్సరాలు నిండి వివాహమై 20 సంవత్సరాలు అయిన మహిళా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్వీ క్రిష్ణారావు, పోలీసు సంక్షేమ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, టైటస్, వీరేశ్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పోలీసు సంక్షేమ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తేనె కన్నా తీయనిది అమ్మభాష : వీసీ



వక్తలను సత్కరిస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రారు తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 : తేనె కన్నా తీయనైనిది అమ్మభాష అని వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం వైవీయూలో తెలుగుశాఖాధిపతి పార్వతి అధ్యక్షతన తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతను తెలుగుశాఖ అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా వెలుగుతుండడం సంతోషకరమన్నారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగుభాషకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రత్యేక న్యాయాధికారి పసుపులేటి శంకర్ మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగుభాష గొప్పదన్నారు. అనంతరం డాక్టర్ అంచె శ్రీనివాస్, తెలుగుశాఖ ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి, రమాదేవి, ఎంఎం వినోదిని, ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసరు గంగయ్యలు పాల్గొన్నారు. వక్తలను ఘనంగా సత్కరించారు.

గురుకుల విద్యాలయాల్లో బెస్ట్‌టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29 : ఉమ్మడి కడప జిల్లాలో గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న బెస్ట్‌టీచరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటరు మాధవీలత ప్రకటనలో తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్న లక్కిరెడ్డిపల్లె సీబీటీ నేషనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్, మడకలవారిపల్లె సీబీటీ ఫిజికల్ సైన్స్, వాల్మీకిపురం ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచరు, సీబీటీ ఎడ్యుకేషన్ సైన్స్ మేథమేటిక్స్ బోధించేందుకు అతిథి టీచర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పీజీటీ, ఫిజికల్ సైన్స్‌కు దరకాస్తు చేసుకునే అభ్యర్థులకు పీజీలో ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ ఉండాలని.. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ, బీఈడీ మెథడాలజీ సెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా జిల్లా కోఆర్డినేటరు గురుకుల సొసైటీ, కడప కలెక్టరేట్ కార్యాలయానికి స్వయంగా దరఖాస్తులు అందించాలని సూచించారు. పోస్టుద్వారా పంపే దరఖాస్తులు స్వీకరించరన్నారు. డిగ్రీ, పీజీలో ఇంగ్లీషు మీడియంలో చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఫోను నెంబర్లు మడకలవారిపల్లె 9704550131, వాల్మీకిపురం 7093323208, లక్కిరెడ్డిపల్లె 9704550132 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన హరిప్రసాద్



మంత్రి రామానాయుడిని కలిసిన హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 29: రాష్ట్ర సచివాలయంలో గురువారం మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. కడప జిల్లాకు సంబంధించి ఆయనతో చర్చించారు. అనంతరం ఇరిగేషన్ మంత్రిని కూడా కలిశారు. ఈసందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబరు 22న కడపలో జరిగే బలిజ ఆత్మీయ సమావేశానికి మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, శ్రీనివాస్‌లను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండిబాబు, బండారు సత్య, కట్టా నారాయణ, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఏఐఆర్ఎన్‌డబ్ల్యుఎల్‌సీ పోటీలలో ప్రతిభ చాటిన శివరామకృష్ణ



కడప (స్పోర్ట్స్), ఆగస్టు 29: ముంబయి నగరంలో ఈనెల 26 నుంచి జరిగిన ఆల్ ఇండియా రైల్వే నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ (ఏఐఆర్ఎన్‌డబ్ల్యుఎల్‌సీ) పోటీలలో కడప నగరం ఉక్కాయపల్లెకు చెందిన ఎ.శివరామకృష్ణయాదవ్ (గుంటూరు రైల్వే ఉద్యోగి-టీసీ) 89 కేజీల విభాగంలో పాల్గొని రజత పతకం సాధించారు. వెస్ట్రన్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో శివరామకృష్ణ స్నాచ్‌లో 140 కేజీలు, అలాగే క్లీన్ అండ్ జెర్క్‌లో 174 కేజీలు మొత్తంగా 314 కేజీల బరువును సునాయాసంగా ఎత్తి సిల్వర్ మెడల్ సాధించారు. ప్రస్తుతం గుంటూరు రైల్వేలో టీసీగా ఉద్యోగం చేస్తున్న శివరామకృష్ణ సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ కోచ్ ఖాదర్‌బాష వద్ద శిక్షణ పొందుతున్నారు. కాగా, మున్ముందు సౌత్ సెంట్రల్ రైల్వే తరఫున మరిన్ని పోటీలలో పాల్గొని విజేతగా నిలిచి పతకాలు సాధించాలని రైల్వే సిబ్బందితో పాటు పలువురు జిల్లా క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు.

ఎన్‌బీయూ ద్వారా మెరుగైన జీవనోపాదులు



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

కడప (ఎన్జీఆర్ సర్కిల్), ఆగస్టు 29: నైబర్ వుడ్ బిజినెస్ యూనిట్ (ఎన్‌బీయూ) ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మెరుగైన జీవనోపాధులు లభ్యమవుతాయని మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మెప్మా మిషన్ డైరెక్టరు ఆదేశాల మేరకు గురువారం మెప్మా కార్యాలయం లో పట్టణ స్థాయి మెప్మా అధికారులకు వికసిత్ ఏపీ అర్తరేటాఫ్ 2047 అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు మాట్లాడుతూ వికసిత్ ఏపీ అర్ధరేటాఫ్ 2024లో భాగంగా ఏపీ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు జీవనోపాధులు మెరుగపడడానికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, నైబర్‌హుడ్ బిజినెస్ యూనిట్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకనుగుణంగా వారికి శిక్షణ ఇచ్చి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా వారి జీవన విధానాన్ని మెరుగుపరచాలని తెలిపారు. అలాగే భారత ప్రభుత్వం ప్రారంభిస్తున్న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారీ చేసే ఉత్పత్తులు దేశవ్యాప్తంగా అమ్మవచ్చు, కొనవచ్చు అని వివరించారు. ప్రతి మున్సిపాలిటీలో సంఘ సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తుల్లో నాణ్యమైన, జీఎస్టీ బ్రాండింగ్ ఉన్నవాటికి ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రతి మున్సిపాలిటీలో 10 యూనిట్లకు, కడప కార్పొరేషన్‌లో 30యూనిట్లకు ఓఎన్‌డీసీలో ఆన్-బోర్డు చేయాలని వివరించారు. జిల్లా ఇనిస్టిట్యుషన్ బిల్డింగ్ ఎల్‌హెచ్ నాగరాజు, వివిధ మున్సిపాలిటీల మెప్మా అధికారులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి : కలెక్టర్



కోటిరెడ్డి సర్కిల్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 29 : క్రీడల వల్ల భౌతిక వికాసం, దేహదారుఢ్యం పెరుగుతుందని.. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను జీవితంలో భాగంగా పెట్టుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. గురువారం స్థానిక డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్‌డేలో భాగంగా వివిధ రకాల క్రీడాకారులకు పోటీలను నిర్వహించి.. బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద కలెక్టరు చేతుల మీదుగా 3 కి.మీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఏడురోడ్లు, పాతరిమ్స్ సర్కిల్, శ్రీకృష్ణదేవరాయ విగ్రహం మీదుగా డీఎస్ఏ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను కలెక్టరు చేతు ల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ యువత, విద్యార్థులు క్రీడల్లో మెలకువలను తెలుసుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో జగన్నాధ్‌రెడ్డి, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, వివిధ క్రీడాకారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అగస్టు 29: గృహ నిర్మాణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పేదలందరికీ గృహ నిర్మాణ పథకంపై అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే విధంగా ఇప్పటికే మంజూరైన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో ఎటువంటి రాజీ లేకుండా నాణ్యతగా చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసున్న ఇసుక పాలసీకి లోబడి ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వివిధ దశల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి నాణ్యతగా చేపట్టేలా చూడాలన్నారు. కాలనీలలో కావల్సిన మౌలిక సదుపాయాలపై ఎంపీడీవోలు, కమిషనర్లు, హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. రాజంపేటలోని బోడిగుంటపల్లిలో ఇసుక రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. జిల్లాలో 46 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమని అంచనా వేశామన్నారు. ఇళ్ల నిర్మాణాల బిల్లులకు సంబంధించి కొంతమందికి అకౌంట్లలో పడడం లేదని తమ దృష్టికి వచ్చిందని, ఆధార్‌సీడింగ్ సరిచూసుకుని బిల్లులు వారి అకౌంటుకు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు 78221 ఇళ్లు కేటాయించారని, వీటిలో 82 శాతం పనులు మొదలు పెట్టారని.. మిగిలినవి కూడా త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, మదనపల్లి, రాజంపేట, సబ్‌కలెక్టర్లు మేఘ స్వరూప్, నదియాదేవి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్‌కు 166 మంది హాజరు



డీపీఆర్‌సీ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో

కడప రూరల్, ఆగస్టు 29: కడప, అన్నమయ్య జిల్లాలలోని ఆయా గ్రామ సచివాలయాలలో పనిచేస్తు బదిలీలకు దరఖాస్తు చేసుకున్న డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీపీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి 111 మం ది, అన్నమయ్య జిల్లా నుంచి 67 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కౌన్సెలింగ్‌కు కడప జిల్లా నుంచి 106 మంది, అన్నమయ్య జిల్లా నుంచి 60 మంది హాజరైనట్లు తెలిపారు. బదిలీలకు సంబంధించి దరఖాస్తులతో పాటు, నోడ్యూస్, స్పౌస్, మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. సెప్టెంబర్ 1న చేపట్టే పింఛన్ల పంపిణీ అనంతరం బదిలీలకు సంబంధించిన ఆర్డర్‌ను డిజిటల్ అసిస్టెంట్లకు ఇస్తామని తెలిపారు. అలాగే ఈనెల 30న గ్రేడ్-5 సెక్రటరీలకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఏవో ఖాదర్‌బాషా, జడ్పీ కడప డీఎల్‌డీవో వెంకటసుబ్బయ్య, డీఎల్‌పీవోలు మస్తాన్‌వల్లి, రమణారెడ్డి, సురేష్, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

కడప రూరల్, ఆగస్టు 29 : పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని గ్రేడ్-2 ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కడప నగరం నాగరాజుపేటలోని జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయంలో ప్రారంభమవుతుందని పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని 610 సచివాలయాలల నుంచి 135 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. బ్యాలెన్స్ పద్ధతిన బదిలీలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మ్యూచువల్, స్పౌస్, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారందరు సకాలంలో కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలని తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల



కొండాపురం, ఆగస్టు 29: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి గురు వారం నీరు విడుదల చేశారు. గండికోటప్రాజెక్టు వద్ద గేట్లు ఎత్తి 7500 క్యూసెక్కుల చొప్పున మైలవరానికి నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 800 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయ సాగర్‌కు 500 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 18.8 టీఎం సీల నీరు నిల్వ ఉంది.

రేపు పెన్షన్ పంపిణీ: ఎంపీడీఓ

ఓబులవారిపల్లె, ఆగస్టు 29: సెప్టెంబరు నెల మొదట్లో ఇవ్వాల్సిన పింఛను ఆగస్టు 31నే ఇస్తున్నామని ఎంపీడీవో విజయ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అందించే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు నెలకు సంబంధించిన పింఛన్‌ను 1వ తేది ఆదివారం కనుక ముందు రోజు పంపిణీ చేస్తున్నామన్నారు. పింఛనుదారులు శనివారం ఇంటిదగ్గరే ఉండాలని సూచించారు.

కోడూరులో కుక్కలు పట్టివేత



కుక్కలను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు, ఆగస్టు 29: పట్టణంలో వీధి కుక్కలను పంచాయతీ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. ఇటీవల పిచ్చికుక్కలు సుమారు 30 మందిని కరవడంతో వారు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీ అధికారులు కుక్కలు పట్టేవారిని పిలిపించి పట్టించారు. ప్రతి వీధిలో తిరిగి కుక్కలను ట్రాక్టర్‌లో వేసుకుని దూర ప్రాంతాల్లో వదిలేశారు. దీంతో పట్టణవాసులు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు.

నిర్విఘ్నంగా అర్ధ మండల పూజ

పెనగలూరు, ఆగస్టు 29: మండల కేంద్రంలోని పి.కొత్తపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో గతనెల 9 నుండి గురువారం 21 రోజులు మండల పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా, ఘనంగా జరిగినట్లు గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు తెలిపారు. మరో 20 రోజుల్లో మండల పూజ పూర్తవుతుందని, ఆ కార్యక్రమాలను కూడా విజయవంతంగా పూర్తి చేసేందుకు గ్రామంలోని ఉభయదాతలు సిద్ధంగా ఉన్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

అందుబాటులో ఎరువులు

సిద్దవటం, ఆగస్టు 29: మండలానికి 60 టన్నులు యూరియాను అధికారులు కేటాయించారు. ఈ క్రమంలో పొన్నవోలు ఆర్‌బీకేకు 20, వంతాటికి 20, సిద్దవటానికి 20 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు తెలిపారు. మండలంలో అవసరం ఉన్న రైతులు వారి ఆధార్‌కార్డు తీసుకుని రైతు సేవాకేంద్రంలో సంప్రదిస్తే వారికి యూరియా ఇవ్వడం జరుగుతుందని వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి



ఉరివేసుకొని మృతిచెందిన నాగేంద్ర

సంబేపల్లి, ఆగస్టు 29: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామం కొత్తపల్లి బిడికికి చెందిన బడుగు నాగేంద్ర (29) గురువారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. బడుగు నాగేంద్ర రాయచోటిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. బుధవారం భార్యతో ఘర్షణ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిందని, దీంతో మనస్థాపానికి గురైన నాగేంద్ర ఉరి వేసుకొని మృతిచెందాడని తెలిపారు. మృతుడుకి భార్య, కూమారుడు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్



రాయచోటిలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు, చిట్వేలిలో 2కే రన్‌లో ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు, పుల్లంపేట ఆదర్శ పాఠశాలలో తెలుగుదనం ఉట్టిపడే విధంగా విద్యార్థుల వేషధారణలు

● ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు

రాయచోటిటౌన్/రాజంపేటటౌన్/పెనగలూరు/ఓబులవారిపల్లె/నందలూరు/చిట్వేలి/రైల్వేకోడూరు/పుల్లంపేట/సిద్దవటం/ ఆగస్టు 29: భారతదేశ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని జిల్లా హాకీ అకాడమీ సెక్రటరి ఇడగొట్టు నాగేశ్వరరావు అన్నారు. గురువారం రాయచోటిలో రాజు హాకీ అకాడమీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1928, 1932, 1936 సంవత్సరాలలో ఒలంపిక్స్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా మార్చిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 29న మేజర్ ధ్యాన్‌చంద్ పేరు మీద స్పోర్ట్స్‌డే జరుపుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాకీ అకాడమీ కోచ్‌లు సుబ్బు నారాయణ, రాజి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే రాజంపేట పట్టణంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్ రాజు ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షవర్దన్, కళ్యాణ్, సుబ్రమణ్యంరాజు, రామచంద్ర, శివశంకర్‌నాయుడు, జయచంద్రరాజు, రఘువీరంద్రరాజు, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో... ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్థానిక హెడ్మాస్టర్ల అధ్యక్షతన గురువారం అంతర్జాతీయ తెలుగుభాషా, క్రీడా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అలాగే కొండూరు ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ సుదర్శనమ్మ అధ్యక్షతన తెలుగు పండిట్ నాగకుమారి, ఫిజికల్ డైరెక్టర్లను ఎస్టీయూ రాష్ట్ర ప్రచార కన్వీనర్ ఈ.రామక్రిష్ణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో... పలు పాఠశాలల్లో ఘనంగా తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. మండలంలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్లో హెడ్మాస్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన తెలుగు పాఠ్యాంశ ఉపాధ్యాయులు నారాయణలు జాతీయ క్రీడా, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. సుధాకర్, శివ, సుజాత, విజయ, కృష్ణకుమారి, పెంచలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరులో.. మండలంలోని నాగిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి అధ్యక్షతన తెలుగు భాష ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, గీత, రమణమ్మ, క్రీడా ఉపాధ్యాయురాలు గౌరీలు ఈ వేడుకలను నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు నాగయ్య, అనంతకృష్ణ, జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్దన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ నీలవేణి, అధ్యాపకులు సమత, వసంత్, రమేష్, సురేష్, కేశవరావు, కృష్ణ, ఆదిలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్వేలి... జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులచే 2కే రన్‌ను నిర్వహించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ట్రూఫ్ కమాండర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు ప్రసాద్‌రాజు, పీఈటీ షబ్బీర్, చిన్నబాబు, బాలజీనాయక్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో... ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రిన్సిపాల్ యం.భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ జి.దయానందం, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రమేష్, తెలుగు అధ్యాపకులు దాసరి మోషే, విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట మండలంలో... గురువారం తెలుగు బాష దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల దళవాయిపల్లె ప్రాథమిక ఉన్నత పాఠశాల, కృష్ణంపల్లె ప్రాథమిక పాఠశాలల్లో గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుభాషకు చేసిన సేవల గురించి కొనియాడారు.

సిద్దవటం జడ్పీ ఉన్నత పాఠశాలలో... మాతృభాష దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు జయంతిని ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయనీలు భవాని, లలిత, లక్ష్మీనరసమ్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే గతేడాది పదో తరగతి తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన వారికి తెలుగు ఉపాధ్యాయునిలు భవాని, లలితలు ఒక్కొక్కరికి రూ.10,116 నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయునిలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురంలో... మోడల్ స్కూల్, కస్తూర్బా, బాలికల పాఠశాలలో గురువారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు రాఘవేంద్రరెడ్డి, శివలీల, చంద్రసేన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుండుపల్లి పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ ప్రసిద్ధ హాకీ క్రీడాకారుడు స్వర్గీయ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్రరాజు, రాధారాణి తమ సొంత నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జయన్న, దేవలానాయక్, హరి కూమార్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

రామాపురం, ఆగస్టు 29: వేరుశెగన పంటను కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అంకయ్య, బీరయ్య గురువారం పరిశీలించారు. మండలంలోని బండపల్లె పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని దిగువ హరిజనవాడకు చెందిన రైతు మనోహర్ వర్షాధారంగా సాగు చేసిన వేరుశెనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశెనగ పంటలో బెట్టను తట్టుకునేందుకు ఒక లీటరు నీటికి 20 గ్రాముల యూరియా లేదా 5 గ్రాముల మల్టీ కే లేదా 5 గ్రాముల 19:19:19 కలిపి పిచికారి చేయడం ద్వారా బెట్ట నుంచి కోలుకుని పంట ఆరోగ్యంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు అశోక్ కుమార్, మాధవి, ఏడీ జయరాణి, ఏవో నాగమణి, ఏఈవో, రైతులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కడప కేవీకే శాస్త్రవేత్తలు

నాణ్యమైన పెట్రోల్ అందించడమే ధ్యేయం



● కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్‌కుమార్

పుల్లంపేట, ఆగస్టు 29: పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల ద్వారా వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించడమే ధ్యేయమని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పుల్లంపేట పోలీసు శాఖ క్వార్టర్స్ ముందు భాగంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంకును గురువారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలిసి డీఐజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు డిపార్టుమెంట్ ఐవోసీ సమకారంతో పెట్రోల్ బంకులను గత 20 సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా మంగళగిరిలో ఏర్పాటు చేశామని, ఆ తర్వాత జైళ్లు ఉన్న ప్రాంతాల్లో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల్లో నాణ్యత లోపించడం వల్ల పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల ద్వారా కల్తీలేని పెట్రోల్ వినియోగదారులకు లభిస్తుండడంతో వీటిపై ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని కింది స్థాయి సిబ్బందిని పోలీసు వెల్ఫేర్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐవోసీ పెట్రోల్ బంకులు క్వాలిటీ, ప్యూరిటీకి సిగ్నేచర్ లాంటిదని, అందువల్లే ప్రజల్లో అభిమానాన్ని చూరగొని సక్సెస్ సాధించామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట డీఎస్పీ సుధాకర్, ఐవోసీ అధికారులు పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడల్లో మోడల్ స్కూలుకు గుర్తింపు



జేసీ ఆదర్శ రాజేంద్రన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డ్ అందుకుంటున్న షామీర్ బాషా

సుంబేపల్లి, ఆగస్టు 29: జిల్లా స్థాయిలో సంబేపల్లి ఆదర్శ పాఠశాల క్రీడల్లో నాలుగోవ స్థానం సాధించడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. గురువారం రాయచోటిలో క్రీడా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల క్రీడల్లో ఈ సంవత్సరం నాలుగోవ స్థానం, గతేడాది మూడోవ స్థానంలో వచ్చిందన్నారు. ఆటలతో పాటు చదువులో విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. ఈ క్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చేతుల మీదుగా వ్యాయామ ఉపాధ్యాయుడు షామీర్‌బాషా ప్రశంశాపత్రం, షీల్డ్ అందుకున్నట్లు తెలిపారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

సుండుపల్లి, ఆగస్టు 29: మండలంలోని రాయవరం గ్రామం జంగంపల్లి సమీపంలోని చెరువు ఆక్రమణలకు గురవుతుందని గురువారం గ్రామస్తులు తహసీల్దార్ దైవాదీనంకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 206లో 36 ఎకరాలు ఉందని, ఈ చెరువులో స్థానికులు అక్రమ కట్టడాలు చేస్తున్నారని, అలాగే చెరువును ఆక్రమించి వ్యవసాయ భూమిగా మారుస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. సమీపంలోని గుట్టను చదును చేసి ఆక్రమించారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



గ్రామ సుభిక్షం కోసం అమ్మవారికి పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఒంటిమిట్ట, ఆగస్టు 29: గ్రామం సుభిక్షం కోసం మండల కేంద్రంలోని అంకాలమ్మ తల్లికి, జాంబవంతునికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని, సకాలంలో వర్షాలు పడాలని ఉద్దేశంతో అమ్మవారికి 101 బిందెలు నీళ్లు, టెంకాయలు, పూలతో అభిషేకం నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానిక మాడవీధిలోని అంకాలమ్మ తల్లికి, కల్లా వీధిలోని జాంబవంతుని విగ్రహానికి గ్రామంలోని పెద్దలందరూ కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి : డీపీఎంఓ

రాయచోటిటౌన్, ఆగస్టు 29: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి(డీపీఎంవో) డా.రియాజ్ బేగ్ అన్నారు. పెద్దలకు అందిస్తున్న బీసీజీ టీకాల కార్యక్రమం తనిఖీలో భాగంగా గురువారం ఆయన పట్టణ పరిధిలోని ఎస్.ఎన్.కాలనీలోని పీహెచ్‌సీని ఎన్ఎంవో డా.సుధాకర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దల బీసీజీ టీకాలు ప్రతి సోమ, గురువారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. అలాగే నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయడంలో వెనుకబడిన పీహెచ్‌సీలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా.నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం: పంతగాని



టీడీపీ విజయవాడ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతులు పరిశీలిస్తున్న పంతగాని

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 29: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. గురువారం విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విజయవాడ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేయిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కార మార్గాన్ని చూపుతున్నట్లు వివరించారు. ఏ ప్రభుత్వం చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు.

వెంకయ్యనాయుడుకు ఘనస్వాగతం



వెంకయ్యనాయుడును కలిసిన రాజంపేట బీజేపీ నేతలు

రాజంపేటటౌన్, ఆగస్టు 29: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు రాజంపేటలో ఘనస్వాగతం లభించింది. ఆయన యర్రగుంట్ల మండలం, కలమల్లలో జరిగిన తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు ఆయన రేణిగుంట నుంచి రైలు మార్గంలో వస్తూ.. రాజంపేట రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగడంతో బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు, పలువురు ముఖ్య బీజేపీ నేతలు, కళాశాలల విద్యార్థులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అందులో కేంద్రీయ విద్యాలయాన్ని త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ ఉపరాష్ట్రపతి రాకతో పాఠశాల విద్యార్థులు జై బోలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

డీఐజీ ప్రవీణ్‌ను కలిసిన టీడీపీ నేతలు



డీఐజీ కోయ ప్రవీణ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రాజంపేట, ఆగస్టు 29: పుల్లంపేట పోలీసుస్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వెళ్తున్న కర్నూలు రేంజి డీఐజీ కోయప్రవీణ్‌ను రాజంపేట టీడీపీ నేతలు కలిశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు వచ్చిన ఆయనను ఈ మేరకు కలిశారు. డీఐజీ రాకతో రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్, సీఐలు యల్లంరాజు, రమణ, రామాంజనేయులు, ఎస్ఐలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని టీడీపీ ముఖ్య నేతలు అక్కడకు చేరుకుని మర్యాదపూర్వకంగా శాలువాతో ఆయనను సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో టీడీపీ నేతలు ఇడమడకల కుమార్, అద్దెపల్లె ప్రతాప్‌రాజు, డీఆర్ఎల్ మణి, అత్తిరాల సుబ్రమణ్యంనాయుడు, గుల్జార్‌బాషా, కరీం పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: మండలంలోని టీడీపీ నాయకులు మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో కర్నూల్ రేంజ్ కోయ ప్రవీణ్‌ను గురువారం రాజంపేటలోని ఆర్అండ్‌బీ గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో శాంతి భద్రత సమస్యతో పాటు రామాలయంలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లపై ఆయనతో చర్చించామని టీడీపీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, మోదుగుల నరసింహులు, రఘురాంరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జీ ఫైజున్నిసా

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 29: జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జి షేక్ ఫైజున్నిసా పేర్కొన్నారు. గురువారం స్థానిక సివిల్ కోర్టులో గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె పోలీసులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్, క్రిమినల్, పెండింగ్ కేసులు సెప్టెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రవీంద్రబాబు, రామక్రిష్ణ, పీవీ సుధాకర్‌రెడ్డి, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛను డబ్బులు డ్రా చేసుకోండి

పెనగలూరు, ఆగస్టు 29: సెప్టెంబరు నెల కోటాకు సంబంధించిన సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది ఈ నెల 30న బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకోవాలని ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం 30న ఉదయమే పింఛన్లను బ్యాంకులో జమ చేస్తుందని తెలిపారు. 31న శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకే లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు.

విద్యాభ్యాసంతో పిల్లల్లో సృజనాత్మకత



తెలుగు వర్ణమాల 56 అక్షరాలతో విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె,ఆగస్టు 29: మాతృభాషలో విద్యాభ్యాసం వల్ల పిల్లల్లో సృజనాత్మకత మెరుగుపడుతుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాష దినోత్సవం, అలాగే క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని గురువారం స్థానిక మోడల్ స్కూల్లో ఇరువురి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగుభాషలో సరలమైన భాష అందుబాటులోకి తెచ్చారని, ఇక క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం తెలుగు పండితులు శ్రీనివాసులు, ప్రసాదు, అరుణకుమారి, పీడీ సోమశేఖర్‌నాయక్‌లకు దుశ్శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మణి, వైస్ చైర్మన్ చలపతి, వైస్ ప్రిన్సిపల్ నాగయ్య, సుధాకర్, సుజాత, జమ్మద్‌బేగం, భారతి, విజయకుమారి, విజయ, సుమీయా, రసూల్, సురేష్, ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్చీలు ఏర్పాటు చేయిస్తాం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 29: అనంతపురం గంగమ్మ జాతరకు వచ్చే చిట్లూరు క్రాస్ వద్ద, అలాగే రవీంద్రనగర్ (మర్రిచెట్టు) వద్ద అమ్మవారి ఆర్చీలు ఏర్పాటు చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. గురువారం గంగమ్మతల్లిని ఆయన దర్శించుకున్నారు. గంగమ్మజాతరకు లక్షల మంది భక్తులు వస్తారని, జాతరలో సరైన వసతులు లేవని సిద్ధార్థరెడ్డి దృష్టికి ఈఓ మారుతి వివరించగా, వసతులు ఏర్పాటుకు మంత్రి దృష్టికి తీసుకెళ్లి గంగమ్మ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చుదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రెడ్డిశేఖర్, రెడ్డయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు జేజేలు



కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో..

గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వాడుక భాషలోనే రచనలు చేయాలని, శాస్త్ర సాంకేతికత సామాన్యులకు చేరాలని గిడుగు చేసిన ఉద్యమాన్ని విద్యార్థులకు వివరించారు. పలుచోట్ల విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా ప్రదర్శనలు నిర్వహించారు. అమ్మ భాషకు పట్టం కట్టాలని పలువురు పిలుపునిచ్చారు.

- చిత్తూరు (సెంట్రల్)

ఆటలాడుదాం



కార్వేటినగరం మండలం డీఎంపురంలో పిరమిడ్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

చదువుతో పాటు విద్యార్థులు ఆటల్లోనూ ఉత్సాహంగా పాల్గొనాలని పలువురు పిలుపునిచ్చారు. భారత హాకీ శిఖరం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. పలు చోట్ల క్రీడాకారులు ర్యాలీలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. - చిత్తూరు క్రీడలు

అఘాయిత్యాలు ఆపండి



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరసిస్తూ బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హత్యాచారాలు, వేధింపులు ఆపాలంటూ ప్లకార్డులను చూపుతూ నినదించారు.

- బంగారుపాళ్యం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● రూ.8.5 లక్షల బంగారు, వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు, ఆగస్టు 29: తాళం వేసిన ఇళ్లనే టార్కెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను ఒకటో పట్టణ సీఐ జయరామయ్యతో కలిసి డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. ఈనెల 15వ తేదీన చిత్తూరు నగరం కట్టమంచికి చెందిన మునికృష్ణ ఇంట్లో తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన నసీమ్ నబి(25), పాత ఢిల్లీకి చెందిన జనసీర పఠాన్(34)లను వారివారి రాష్ట్రాల్లో పట్టుకుని ఢిల్లీ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం చిత్తూరుకు తీసుకొచ్చి వారి నుంచి రూ.8.50 లక్షల విలువ చేసే 140 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఏఎస్‌ఐ త్యాగరాజు, కానిస్టేబుళ్లు సురేష్‌బాబు, సుధాకర్, జనార్దన్, రమేష్, రేణు, వాసులను డీఎస్పీ అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ఆర్‌ఎంపీకి హెచ్చరికలు చేస్తున్న జిల్లా వైద్యాధికారుల బృందం

పలమనేరు, ఆగస్టు 29: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆర్‌ఎంపీలను జిల్లా వైద్యాధికారులు హెచ్చరించారు. పట్టణంలోని పాతపేట శ్రీనివాస క్లినిక్‌లో ఒక ఆర్‌ఎంపీ వేసిన సూది మందు కారణంగా ఇంటర్ విద్యార్థిని తేజశ్రీ రెండు రోజుల క్రితం మరణించిన విషయం విదితమే. ఈ సంఘటనతో జిల్లా వైద్యాధికారులు ఆర్‌ఎంపీల వైద్యంపై దృష్టి సారించారు. పలమనేరులో గురువారం ఆర్‌ఎంపీలు నడుపుతున్న క్లినిక్‌లను జిల్లా వైద్యబృందం సందర్శించింది. పలు క్లినిక్‌లలో సూదిమందులు, వినియోగించిన సూదులు, మందులను అధికారులు కనుగొన్నారు. కొన్ని క్లినిక్‌లలో పడకలు కూడా ఉండటాన్ని గుర్తించారు. ఇకపై సూదులు వేసినా, చీటి మందులు రాసిచ్చినా, క్లినిక్‌లలో సెలైన్లు పెట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు, జిల్లా విస్తరణ అధికారి జయరాం, మెడికల్ ఆఫీసర్ నిరంజన్ కుమార్, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్‌బాబు పాల్గొన్నారు. కాగా తనిఖీల నేపథ్యంలో కొందరు ఆర్‌ఎంపీలు క్లినిక్‌లను మూసేసి వెళ్లిపోయారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎంపీ



షరణ్‌ను అభినందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల

చిత్తూరు రూరల్, ఆగస్టు 29: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. గురువారం చిత్తూరు మెసానికల్ మైదానంలో జరిగిన జాతీయ క్రీడాదినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర క్రీడాప్రాదికార సంస్థల ద్వారా జిల్లాకు అవసరమైన కోచ్‌లను తీసుకొస్తామన్నారు. అనంతరం హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీఎస్‌ఏ మైదానం నుంచి కలెక్టర్ బంగ్లా వరకు క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మద్దిపట్ల చంద్రశేఖర్, వాలీబాల్ అసోసియేషన్ నాయకులు జయప్రకాష్, డీఎస్‌డీవో బాలాజీ, పీడీ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే 21 నెలల వయసులో 21 నిమిషాల్లో 50 మీటర్ల పరుగును పూర్తి చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన బాలుడు షరణ్ గొరజాలను.. అతడిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు స్వరూప్, ప్రియాంకను ఎంపీ అభినందించారు.

నేడు జిల్లాలో వనమహోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 29: జిల్లాలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించనున్నట్లు డీఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డి, ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు తూర్పు విభాగం చిత్తూరులోని నగరవనంలో జరిగే కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అరగొండలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొననున్నట్లు తెలిపారు.

తెలుగు భాష గొప్పతనాన్ని లోకానికి చాటింది గిడుగు

గుడుపల్లె, ఆగస్టు 29: తెలుగు భాష గొప్పతనాన్ని లోకానికి చాటి చెప్పింది భాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి అని ఇన్‌చార్జి వీసీ దొరస్వామి పేర్కొన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ఎమినో భవనం సెమినార్ హాలులో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కందుకూరి సంఘ సంస్కరణకు పూనుకుంటే.. గురుజాడ ఆధునిక సరళ సాహిత్యపు భాషకు పునాదులు వేశారని.. గిడుగు ప్రజల వ్యవహారిక భాషోద్యమానికి ఊతమై నిలిచి సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానాన్ని అందుకొన్నారని వివరించారు. ద్రావిడ వర్సిటీలో ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వీసీ తెలిపారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆంగ్ల వ్యామోహంలో పడి తెలుగు భాషను మరచిపోతున్నామని, భాషాభివృద్ధికి అందరు కలిసి కట్టుగా పాటు పడాలన్నారు. మన సంస్కృతి గొప్ప దనాన్ని, తెలుగు ఔనత్యాన్ని అకాడమిక్ డీన్ ఆచార్య శ్యామల వివరించారు. ఈ సందర్భంగా గిడిగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం





కుప్పంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు, ఫిర్యాదుల రిజిస్ట్రేషన్‌కు క్యూలో కిక్కిరిసిన ప్రజలు

కుప్పం, ఆగస్టు 29: ప్రజా ఫిర్యాదుల వేదికలో చేసుకున్న ఫిర్యాదులకు సత్వర పరిష్కారం లభించేందుకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పంలోని మండల సచివాలయంలో గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ శాఖ ఇక్కడ వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. కాగా కలెక్టర్‌కు సమస్యల గురించి విన్నవించుకోవడానికి ప్రజలు తండోపతండాలుగా క్యూ కట్టారు. నిజానికి ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే వినతుల స్వీకరణకు గడువు విధించారు. అయితే ప్రజలు లెక్కకు మిక్కిలి రావడంతో పాటు క్యూలో నిలుచుకోవడంతో మధ్యాహ్నం మూడు గంటలదాకా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తూనే ఉన్నారు. ప్రజల నుంచి మొత్తం 257 ఫిర్యాదులు అందాయి. అందులో రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులే 151 ఉన్నాయి. సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు చెందిన ఫిర్యాదులు 31, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ 22, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ 13, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 6, సివిల్ సప్లయిస్ 5, పోలీస్, గ్రామీణ నీటి సరఫరా నాలుగేసి, ఎండోమెంట్స్ 3, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, ఎకనామిక్స్ అండ్ స్టాటిక్స్, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్ రెండేసి, ఏపీ డిఫరెంట్లీ ఏబుల్డ్ అండ్ సీనియర్ సిటిజెన్స్ అసిస్టెన్స్ కార్పొరేషన్, అగ్రికల్చర్, అనిమల్ హజ్బెండ్రీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్, రూరల్ డెవలప్‌మెంట్, వాటర్ రిసోర్సెస్, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు ప్రజలనుంచి అధికారులకు అందాయి.

ఈ కార్యక్రమంలో జేసీ విద్యాధరి, ఆర్డీవో శ్రీనివాసరాజు, డీఎస్పీ పార్థసారథి, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఐటీ నోటీసులు

రిటర్న్స్ దాఖలుకు రేపే చివరి రోజు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 29: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (సింగిల్ విండోలు) ఆదాయపన్ను శాఖ నోటీసులు ఇచ్చింది. ఐటీ స్లాబుల ప్రకారం పన్ను చెల్లించని సంఘాలకు తాకీదులు వచ్చాయి. ఏటా రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న కొన్ని సింగిల్ విండోలు మాత్రమే ఆదాయపన్ను చెల్లిస్తున్నాయి. చాలా సంఘాలు ఐటీ రిటర్న్స్ కూడా దాఖలు చేయడం లేదు. తగినంత ఆదాయం లేని సింగిల్ విండోలు పన్ను చెల్లింపులపై తటపటాయిస్తున్నాయి. సహకార చట్టం ప్రకారం సేవాదృక్పథంతో సంఘాలు నిర్వహిస్తున్నామంటూ, వాటి పర్సన్ ఇన్‌చార్జిలు పన్ను మినహాయింపు కోరుతున్నారు. దీంతో ఆదాయ మూలాల నుంచి పన్ను మినహాయింపు (టీడీఎస్) లేఖలు సమర్పించాలని ఆదాయపన్ను అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 37 సింగిల్ విండోలు కొనసాగుతున్నాయి. కాగా నాబార్డు ఆర్థిక సహాయంతో ఆప్కాబ్, డీసీసీబీల నుంచి రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు, ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగుల మందులు పంపిణీ చేస్తున్న సింగిల్ విండోలు ఆదాయపన్ను చెల్లించాలనడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎరువులు, పురుగుల మందులకు కంపెనీలు ఇచ్చే మార్జిన్ మనీ మాత్రమే సంఘాలకు ఆదాయంగా ఉంటుంది. రూ.లక్ష లోపు పంటరుణాలపై సంఘాలకు వడ్డీ రావడం లేదు. రూ.లక్ష పైన పంటరుణాలు, దీర్ఘకాలిక రుణాలకు మాత్రమే వడ్డీరూపంలో 1.25 శాతం ఆదాయం సింగిల్ విండోలకు లభిస్తుంది. దీంతో పాటు బంగారం కుదువ వ్యాపారం చేస్తున్నా వచ్చే ఆదాయం తక్కువ అని అధికారులు అంటున్నారు. ఇందులో సంఘాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు పోగా మిగిలిన సొమ్ము సింగిల్ విండోలకు డిపాజిట్‌గా ఉంటుంది. అయితే మొత్తం ఆదాయంపై పన్ను చెల్లిస్తే సంఘాలకు మిగిలేదేమి లేదని విండో అధికారులు అంటున్నారు. అందువల్ల లాభాలు తక్కువగా వున్న సింగిల్ విండోలకు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు విండోల కంప్యూటరీకరణ పూర్తికాకపోవడంతో అంతా మాన్యువల్ రికార్డులతోనే కార్యకలాపాలు సాగుతున్నందున ఆదాయ పన్నుశాఖ కోరిన సమాచారాన్ని ఇవ్వడం సిబ్బందికి తలనొప్పిగా మారుతోంది. వివిధ పనులతో సిబ్బంది బిజీగా ఉన్నందున నోటీసులు ఇచ్చి ఐటీ రిటర్న్స్ శనివారంలోగా దాఖలు చేయమనడంపై సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీసీవో నాగవర్ధన మాట్లాడుతూ ఇప్పటికే 37 సింగిల్ విండోలకు గాను 32 విండోలు ఐటీ రిటర్న్స్ ఇచ్చాయని, మిగిలిన ఐదు విండోలు శనివారం లోగా ఇవ్వాలని సంబంధిత సీఈవోలను ఆదేశించినట్లు తెలిపారు.

జ్వరంతో వచ్చి మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువుల ఆరోపణ ● మృతదేహంతో ఆస్పత్రి వద్ద నిరసన





అత్యవసర విభాగం వద్ద కవిత మృతదేహం, మృతురాలి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాద్

చిత్తూరు రూరల్, ఆగస్టు 29: జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన మహిళ మృతిచెందింది. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ మృతురాలి కుటుంబీకులు ఆరోపించారు. వివరాలిలా ఉన్నాయి. గంగాధర నెల్లూరు మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన కవిత(36) తీవ్ర జ్వరంతో గురువారం సాయంత్రం 6 గంటలకు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబీకులు ఆమెను చిత్తూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. తీసుకొచ్చిన రెండు గంటల సమయానికి ఆమె ఊపిరి ఆడక చనిపోయారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కవిత మృతి చెందినట్లు ఆమె కుటుంబీకులు అత్యవసర విభాగం ఎదుట మృతదేహాన్ని ఉంచి నిరసన చేపట్టారు. ఈ విషయాన్ని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు వారు సమాచారం ఇవ్వడంతో.. ఆయన అనుచరులు వచ్చారు. ఘటనపై వైద్యులను ఆరాతీశారు. తక్షణం ప్రాథమిక చికిత్స అందించామని, ఊపిరితిత్తుల సమస్య కారణంగా చనిపోయినట్లు డాక్టర్లు వెల్లడించారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూ టౌన్ ఎస్ఐ ప్రసాద్ ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు.

డబ్బు కోసమే చంపేశారు

● పోలీసుల అదుపులో నిందితులు

చిత్తూరు, ఆగస్టు 29: చిత్తూరు నగరంలో బుధవారం హత్యకు గురైన వ్యక్తిని డబ్బు కోసమే ముగ్గురు వ్యక్తులు కొట్టి చంపేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు చెప్పిన వివరాల మేరకు.. బంగారుపాళ్యంకు చెందిన దావూద్‌బాషా బుధవారం నగరంలోని ఓ మద్యం షాపులో మద్యం తాగి బయటకు వచ్చాడు. అక్కడే ఉన్న నగరంలోని తోటపాళ్యంకు చెందిన రాజేష్, మణికంఠ, అనంతపురం జిల్లాకు చెందిన కార్తీక్ అతన్ని డబ్బులు ఇవ్వమని బెదించారు. నిరాకరించడంతో కొట్టుకుంటూ సంతపేట వీరభద్రకాలనీ రోడ్డుకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి దావూద్‌బాషా భార్యకు ఫోన్ చేసి రూ.20వేలు తీసుకురావాలని, లేకపోతే భర్తను చంపేస్తామని బెదిరించారు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో తాగిన మైకంలో ఉన్న ఆ ముగ్గురు పక్కనే ఉన్న బండరాయితో దావూద్‌బాషాను కొట్టి చంపేసి పారిపోయారు. పోలీసులు విచారణ చేపట్టి రాజేష్, మణికంఠ, కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశముంది.

డీవీఎంసీ సభ్యుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 29: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో కొత్త సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో ఐదుగురు ఎస్సీ, ఎస్టీలు, ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల (ఎస్సీ, ఎస్టీలు కాకుండా) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాల అభ్యున్నతి కోసం పనిచేసివారై ఉండాలని వివరించారు. ఎస్సీ ఎస్టీల హక్కులు, పౌరహక్కుల చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇదివరకు చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, తగిన ఆధారాలతో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి, న్యూ కలెక్టరేట్ కార్యాలయం, చిత్తూరు అనే చిరునామాకు సెప్టెంబర్ 9లోపు దరఖాస్తులు అందించాలని తెలిపారు.

టీటీడీకి విరాళంగా వాహనం



తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి గురువారం ఉదయం టాటా సంస్థకు చెందిన ఓ రవాణా వాహనం విరాళంగా అందింది. రూ.10 లక్షల విలువైన టాటా యోధ 1700 బీఎస్‌వీఐ రవాణా వాహనాన్ని పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి అందజేశారు. ఈమేరకు గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. కర్ణాటక ఎమ్మెల్యే గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం కార్యక్రమానికి

ముఖం చాటేసిన వైసీపీ నేతలు

పాలసముద్రం, ఆగస్టు 29: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కార్యక్రమానికి పలువురు వైసీపీ నేతలు ముఖం చాటేశారు. పాలసముద్రం మండలం క్రిష్ణజిమ్మాపురంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో గురువారం జరిగిన నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తాను వస్తున్నట్లు నాయకులందరికీ ఆయన బుధవారం ఫోన్లు చేసి పిలిచారు. అయినా, మండల అధ్యక్షురాలు శ్యామల, ఆమె భర్త, వైసీపీ నేత శివప్రకాష్ రాజు, మండల పార్టీ కన్వీనర్ తులసీరామ్ యాదవ్, నలుగురు ఎంపీటీసీలు, ఏడుగురు సర్పంచులు, పలువురు నాయకులు ఆయన కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. మండల వైసీపీలో వర్గవిభేదాలున్నాయి. ఇక, అధికారంలో ఉన్నప్పుడు నోటిదురుసుతో ప్రవర్తించిన నారాయణస్వామికి నాయకులు ముఖం చాటేసి ఇలా తమ నిరసన తెలిపారని చర్చ జరుగుతోంది.

స్విమ్స్‌లో రోగి అదృశ్యంపై పోలీసుల విచారణ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 29 :తిరుపతి స్విమ్స్ శ్రీపద్మావతి భవనంలోని ఎంఐసీయూ వార్డులో చికిత్స పొందుతూ కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప ఆచూకీ గురువారం కూడా లభించలేదు.అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్ప(65)కన్పించకపోవడంపై 'స్విమ్స్‌లో రోగి అదృశ్యం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన పోలీసులు, స్విమ్స్ యాజమాన్యం ఆస్పత్రి ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో గురువారం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. డైరెక్టర్ ఆర్వీకుమార్ బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోగి ఆచూకీ కోసం వెస్ట్ సీఐ రామకృష్ణ ఆయన బృందంతో కలిసి ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీతారమప్ప చికిత్స పొందుతున్న వార్డును పరిశీలించి అక్కడి సిబ్బందిని విచారించారు. స్విమ్స్ ఆవరణలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రి పరిసరాలతో పాటు బర్డ్, రుయా ఆస్పత్రి పరిసరాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే అదృశ్యమైన రోగి వృద్ధుడు కావడం, నాల్గవ అంతస్తు నుంచి కిందకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాటు బయటకు వెళితే కనీసం ఆ దృశ్యాలు కూడా సీసీ కెమెరాల్లో రికార్డు కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నట్లు స్విమ్స్ సిబ్బంది చెబుతున్నారు. స్విమ్స్‌లో పేషెంట్ సీతారామప్ప కన్పించకుండా పోవడానికి ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఎమ్మార్పీఎస్, బీసీ విద్యార్థి సంఘం నేతలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవడంతోపాటు తప్పిపోయిన రోగిని త్వరితగతిన కుటుంబసభ్యులకు అప్పగించాలని డిమాండు చేశారు.



స్విమ్స్‌లో బాధితులను అడిగి వివరాలు సేకరిస్తున్న సీఐ రామకృష్ణ

దేశభాషలందు తెలుగులెస్స

● ఘనంగా మాతృభాషా దినోత్సవ వేడుకలు ● తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగుకు ఘననివాళి


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న మెయిన్ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు


తంబళ్లపల్లెలో గిడుగు, ధ్యాన్‌చంద్‌లకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్


కలికిరిలో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

పీలేరు, ఆగస్టు 29:'దేశభాషలందు తెలుగులెస్స' అంటూ తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పీలేరు పట్టణంతోపాటు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని పిల్లలు సాంప్రదాయ దుస్తులు ధరించి తెలుగు తల్లి, తెలుగు కవుల వేషధారణలో ర్యాలీలు నిర్వహించారు. తెలుగు భాష తల్లిలాంటిదని, దానిని నిర్లక్ష్యం చేయబోమని నినాదాలు చేశారు. విద్యార్థుల ర్యాలీలతో పీలేరులో పండుగ వాతావరణం నెలకొంది. పీలేరు తెలుగు భాషా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలువురు ప్రముఖ కవులతో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేంపల్లె అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్య ప్రయోజనమని, ప్రజలకు ఉపయోగపడేందుకే గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషను సృష్టించాడని తెలిపారు. అనంతరం తెలుగు వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుమునుపు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అంతకుమునుపు స్థానిక మెయిన్ స్కూల్ హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి నేతృత్వంలో అక్కడి ఉపాధ్యాయులు తెలుగు భాషా సమితి సభ్యులు జలకనూరి మురళీధర్‌రాజు, సరస్వతి శ్రీరాములు రాజును ఘనంగా సన్మానించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో రిటైర్డు తెలుగు అధ్యాపకుడు అన్నయ్య నాయుడు విద్వాన్ ప్రసాద్, ఎంఈవోలు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, తెలుగు భాషా సమితి సభ్యులు, హెచ్‌ఎంలు నటరాజన్, గంగాధర్, తెలుగు అధ్యాపకులు నరసింహులు, శ్రీనివాసులు రెడ్డి, రజనీ, ఎల్లయ్య, సురేశ్, రామచంద్ర, తెలుగు ఉపాధ్యాయులు రాజన్న, శచీదేవి, రేణుక, షరీఫ్, బీవీ రమణ, రామ్మూర్తి, రమణయ్య, ఫరూఖ్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గిడుగు వెంకటరామమూర్తి పంతులకు నివాళులర్పించి పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు ఉషారాణి, నాగరాజ, చంద్రశేఖర్, చారాదేవి పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాల్లో వేడుకలు నిర్వహించారు. అలాగే వేపూరికోటలోని ఎస్వీ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు తెలుగుతల్లి అలంకణతో ఆకట్టుకున్నారు. కరెస్పాండెంట్ బీఎస్ గోపాల్‌రెడ్డి తెలుగుభాషా దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకడలో:తెలుగు భాషకు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించిన గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని కోన హైస్కూల్ హెచ్‌ఎం చెంగల్‌రాయులు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. గురువారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఘనంగా ర్యాలీ నిర్వహించి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలపై పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఘనంగా తెలుగు భాషా హెచ్‌ఎమ్ అంజాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక బస్టాండు కూడలిలో ర్యాలీ నిర్వహించి తెలుగు భాషా పండితులు గిడుగు రామమూర్తి, తెలుగు కవుల గురించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్, శ్రీవాణి, రేణుక, తనూజ, వీరబద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: అమ్మ లాంటి మాతృభాషను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు వేసిన చెక్కభజనలు, కోలాటలు, ఎంతగానో ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ వాణిశ్వరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: తేనెలొలుకు భాష మన తెలుగు భాష అని పెద్ద మండ్యం ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దమండ్యం, యల్లంవారిపల్లి, కలిచెర్ల , వెలిగల్లు, మోడల్ స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం ప్రత్యేక సమావేశాలు జరిగాయి. ప్రిన్సిపాల్ రామాంజులునాయుడు, హెచ్‌ఎంలు అమీన్, రామచంద్రా, తెలుగు ఉపాధ్యాయలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో: మాతృభాషను ఆదరించాలని కలికిరి ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అంజలీదేవి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలుగు భాషకున్న చరిత్ర ప్రపంచంలోనే అతి గొప్పదని కొనియాడారు.ఈ సందర్భంగా వ్యాస, వక్తృత్వ, పాట, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజలీ దేవితోపాటు వైస్ ప్రిన్సిపాల్ గులాబ్ జాన్, అధ్యాపకులు మాధవి, స్వర్ణలత, ఉదయ, లిఖిత, జి.మాధవి, హాజీరా, శైలజ, కీర్తి, అనూష, దేవి, రమణ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలో తెలుగుభాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో గిడుగురామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. గిడుగు రామ్మూర్తి, క్రీడామాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ల జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు పద్యపఠనము, వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడాపోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతిప్రదానం చేశారు. ఎంఈవో రెడ్డిశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనూనాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ వెంకట్రమణ, నాయకులు కుడుం శ్రీనివాసులు, నారాయ ణస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి, ప్రత్యూషసాయిలీల, గాయిత్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: అమ్మలాంటి మాతృభాషను అందరూ అలవాటు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో తెలుగుభాషా క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు పాటుబడిన ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి, హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్, తెలుగుతల్లి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎస్‌ఎంసీ ఛైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


సాంబశివ (ఫైల్‌ఫొటో)

కలకడ, ఆగస్టు 29:మండలంలోని కోన గ్రామానికి చెందిన సాంబశివ(34) అనే యువకుడు అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. యువకుడు కారు వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తునట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 24వ తేదీ సాయంత్రం మదనపల్లె పట్టణం సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజి విద్యార్థులను టూర్ నిమిత్తం కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు విహారయాత్రకు వెళ్తుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడన్నారు. ఈ క్రమంలో సాంబశివ ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. భార్య నాగరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

గుర్రంకొండ, ఆగస్టు 29:అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. మండలంలోని మర్రిపాడు గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను టిప్పర్‌లో తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో టిప్పర్ పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతి ఎర్రాతివారిపల్లి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాహుదా వంకలో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌కు లోడ్ చేసి సమీపంలోని గుండ్లబురుజుకు కాలనీలో విక్రయించేందుకు తీసుకెళుతుండగా డ్రైవర్ ప్రేమకుమార్‌తో పాటు ట్రాక్టరును పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ యర్రాతివారిపల్లికి చెందిన సోమశేఖర్‌గా తెలిపారు.

పెద్దతిప్పసముద్రంలో : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఎస్‌ఐ స్వాధీనం చేసుకుని గురువారం మండల తహసీల్దార్ శ్రీరాములు నాయక్ కు అప్పచెప్పడంతో తహసీల్దార్ రూ. 10వేలు జరిమానా విధించారు. ఎవ్వరైనా ఇసుకను తరలిస్తే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

బి.కొత్తకోట, ఆగస్టు29: బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలో గురువారం కానగలకుంటలో మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్టు తహశీల్దార్ శ్రీధర్‌రావు తెలిపారు. యంత్రాలు పెట్టి మట్టి తవ్వుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పరిశీలించామని యంత్రంతోపాటు, మట్టిని బయటకు తరలిస్తున్న ఓ టిప్పర్‌ను సీజ్‌చేసి తదుపరి చర్యలకు సిఫారసు చేయడం జరిగిందన్నారు.

ప్రజా మౌలిక సదుపాయాలకు రూ.5 వేల కోట్లు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీసీకే పార్టీ నేత పీటీఎం శివప్రసాద్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29: రాష్ట్రంలో ప్రజా మౌలిక వసతులైన వైద్య, ప్రజా ఆరోగ్య, మంచినీటి పారిశుధ్య సదుపాయాల కోసం రూ. 5 వేల కోట్లు విడుదల చేయాలని వీసీకే పార్టీ నేత పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వీకేసీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో మెడికల్ ఎమరెజన్సీ కోసం నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు వంద కోట్లను కేటాయిస్తూ వెనబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఆదివాసీ ఏజన్సీ ప్రాంతాలకు కిడ్నీ వ్యాధిగ్రస్థుల నిలయాలైన శ్రీకాకుంళం, ఉద్ధానం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకే కాకుండా ఎ.కొండూరు, తిరువారు, మెట్ట ప్రాంత ప్రజల ప్రాణ రక్షణకు అదనంగా రూ. రెండు వేల కోట్లు కేటాయించాలన్నారు. సమావేశంలో వీసీకే, బాస్ నాయకులు రవిశంకర్, రెడ్డిప్రసాద్, తలారి కృష్ణ, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ గౌరవాధ్యక్షుడిగా త్యాగరాజు



మదనపల్లె అర్బన్, ఆగస్టు 29: మదనపల్లె వన్ డిపో ఏపీపీటీడీ కార్మిక పరిషత్ గౌరవాధ్యక్షుడుగా గుత్తికొండ త్యాగరాజును ఏకగ్రీంగా ఎంపిక చేశారు. ఈసందర్భంగా మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో కార్మిక పరిషత్ కమిటీని నియమించారు. ఇందులో అధ్యక్షుడుగా ఆర్‌జేఎన్ రెడ్డి, కార్యదర్శిగా కె. నాగరాజు, కమిటీ సభ్యులుగా ఎంఆర్ నాయక్, జీ. మధుకర్, బి. చలపతి, జీ రాజన్న, అయ్యన్ కుమార్, ఎస్‌ఎస్ బాషా, కేపీఅఎన్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన గౌరవాధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు మాట్లాడుతూ ఆర్టీసీలో ఐక్యతాభావం పెపొందించడానికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకుని పోయి త్వరితగతిన పరిష్కారం చేయడానికి ఒత్తిడి తెస్తామన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ప్రకటన జారీ

కలికిరి, ఆగస్టు 29: స్థానిక నల్లారి అమరనాథ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు గెస్ట్ లెక్చరర్ల నియామకం కోసం దరఖాస్తులు పంపుకోవాలని ప్రిన్సిపాల్ ఎంవీ విజయకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఖాళీగా వున్న సివిక్స్ హిందీ సబ్జెక్టులను బోధించడానికి గెస్ట్ లెక్చరర్ల నియామకం కోసం సెప్టెంబరు 2వ తేదీ లోగా దరఖాస్తులు పంపుకోవాలని ఆయన కోరారు. సంబంధిత సబ్జెక్టులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు మాత్రమే అర్హులని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సీటీఎం స్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు


క్రీడా ప్రతిభా అవార్డుఅందుకున్న ఇన్‌చార్జీ హెచ్‌ఎం గిరిధర్‌నాయక్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29: ఏపీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా ప్రతిభా అవార్డును భాగంగా మదనపల్లె మండలం సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అందుకుంది. స్కూల్ గేమ్స్ 2023-24లో ప్రతిభ చూపి 211 పాయింట్లతో జిల్లాలో మొదటి స్థానం సాధించినందుకుగాను జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, చేతుల మీదుగా క్రీడా ప్రతిభా అవార్డును ఇన్‌చార్జి హెచ్‌ఎం గిరిధర్‌నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, సురేష్ బాబు అందుకున్నారు. పాఠశాల స్కూల్ మనిటరింగ్ కమిటీ సభ్యులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దమండ్యం, ఆగస్టు29: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం మండలంలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం కలిచెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం క్రీడాకారులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తరిగొండ, గుర్రంకొండలో విద్యార్థులు ర్యాలీ చేశారు. అనంతరం బస్టాండులో మానవహారంగా నిలబడి క్రీడల ప్రాముఖ్యతను వివరించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు క్రీడలు, జానపద గీతాలపన, పద్య పఠనం, పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

కలకడలో:జాతీయ క్రీడల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోన హైస్కూల్, కలకడ ఆదర్శపాఠశాల్లో భారత హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కోన హైస్కూల్ విద్యార్థులు పిరమిడ్ ఆకారంలో ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు.

నిమ్మనపల్లిలో: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని హెచ్‌ఎమ్ అంజాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి పోటీల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లెలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. హాకీ ఆటగాడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మదనపల్లె అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం


సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29: మదనపల్లె అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. విజయవాడలో గురువారం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిసి మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధి కోసం తయారు చేసిన ప్రణాళికను అందించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో మదనపల్లె నియోజకవర్గం పర్యటన చేస్తానని తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో నిరుపేదలకు పేదల కాలనీ పేరుతో వేయి ఇళ్లు ఇవ్వడానికి అంగీకరించారని పేర్కొన్నారు.

రెవెన్యూ భూ బాధితులకు న్యాయం చేయండి


రెవెన్యూ మంత్రిని కలిసిన సీపీఐ నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29: మదనపల్లె రెవెన్యూ భూ బాధితులకు న్యాయం చేయాలని గురువారం రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సీపీఐ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, ఈశ్వరయ్యలు కోరారు. ఈసందర్భంగా గురువారం వారు విజయవాడలో రెవెన్యూ మంత్రిని కలిసి ఫ్రీహోల్డ్ తర్వాత 22ఏ లో జరిగిన వాటిని రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దందాలు బయటకు వస్తాయనే నెపంతో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం చేశారని వారిపై చర్యలు తీసుకుని పేదల భూములను వారికే కేటాయించేలా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో ఉన్న ఏ ఒక్కరినీ ఇంత వరకు అరెస్టు చేయాలేదని వాపోయారు. గత వైసీపీ ప్రభుత్వంలో పేదల భూములను బలవంతంగా, దౌర్జన్యంగా లాక్కోవడమే కాకుండా ప్రభుత్వ భూములు, చుక్కల భూములను, దేవాదాయ శాఖ భూములను, చెరువులు, కుంటలు వాగులు, వంకలు, ఇనాం భూములు, వంక పరంబోకు భూములు ఫ్రీహోల్డ్ చేయించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. 22ఏలో జరిగిన అవకతవకలు బయట పడుతాయనే ప్రభుత్వం మారిన వెంటనే పేదల రికార్డులను బూడిద చేశారన్నారు. ఈ సంఘటన అనంతరం రాష్ట్ర రెవెన్యూ ప్రధాన కార్యదర్శి సిసోడియాకు ఒక్క రోజులోనే 689 రైతులు తమ సమస్యలను అర్జీ రూపంలో అందించారన్నారు. వైసీపీ వారు చేసిన అరాచకాలకు బయపడి నోరు మెదపని రైతులు చాలా మంది ఉన్నారన్నారు. భూములను కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకత్వంతోపాటు మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

పక్కాగా ఫ్రీ హోల్డ్ భూముల రీవెరిఫికేషన్


ఫ్రీహోల్డ్ భూరికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29: ఫ్రీహోల్డ్ పొందిన రైతుల భూముల రీవెరిఫికేషన్ పక్కాగా ఉండాలని, వివరాలను ప్రత్యేక ఫారంలో పూర్తి వివరాలతో నమోదు చేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని వలసపల్లె, పప్పిరెడ్డిపల్లె, చిప్పిలి, కోళ్లబైలు గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్‌కు సంబంధించి తహసీల్దార్ ఖాజాబీతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూములు కలిగిన రైతులతో మాట్లాడారు. ఏ సమయంలో అసైన్‌మెంట్ చేసింది. అన్‌లైన్‌లో ఎవరి పేరుతో ఉంది. ఫ్రీహోల్డ్ రైతు ఎవ్వరు, రిజిస్ట్రేషన్ ఎవరి పేరిట అయింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వివరాలను ప్రత్యేక ఫారంలో నమోదు చేయాల్సిందిగా రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ రెడ్డెప్ప, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్వోలు నారాయణ, చంద్రమోహన్, జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకరోజు ముందే పింఛన్ల పండుగ

●రేపు ఇళ్ల వద్దనే పంపిణీ ● మండలంలో 6244 మందికి..రూ.2.69కోట్లు

తంబళ్లపల్లె, ఆగస్టు 29: ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31వ తేదీనే (శనివారం)లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సురేంద్రనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో.. ఒక రోజు ముందు గానే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో 31న పింఛన్ అందుకోలేని వారికి.. 2వ తేదీ సోమవారం పంపిణీ చేస్తామన్నారు. తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా వృద్ధాప్య, వికలాంగ, వితంతు తదితర అన్ని రకాల పింఛన్లు కలిపి 6,244 ఉన్నాయని, వారికి సెప్టెంబరు నెలకు సంబంధించి రూ.2,69,29,000లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలో ఉన్న 12 సచివాలయాల పరిధిలో 194 క్లస్టర్లలో 96 మంది సచివాలయ సిబ్బంది ఉదయం 5 గంటల నుంచే ఇళ్ల వద్దకే వచ్చి పింఛను సొమ్మును అందచేస్తారన్నారు. పింఛను లబ్ధిదారులు అందరూ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని ఎంపీడీవో కోరారు.

కలికిరిలో:ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31వ తేదీ (శనివారం) పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. పింఛనుదారులంతా అందుబాటులో ఉండి పింఛన్లు తీసుకోవాలని కోరారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం అయినందువల్ల ఒక రోజు ముందుగానే పంపిణీ చేపడుతున్నట్లు చెప్పారు. శనివారం పంపిణీ కాకుండా మిగిలిపోయిన పింఛన్లను సోమవారం పంపిణీ చేస్తామన్నారు. గతంలో పంపిణీ చేసిన ఉద్యోగుల చేతనే ఈ నెల కూడా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే విధంగా ఒకటి రెండు పంచాయతీలకు కలిపి ఒక్కో సూపర్‌వైజింగ్ అధికార్లను కూడా నియమించినట్లు గంగయ్య వివరించారు. ఉదయం 6 గంటల నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

ములకలచెరువులో: మండలంలో ఒక రోజు ముందే ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తోందని ఎంపీడీవో పోలప్ప పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వతేదీన ఆదివారం రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఒక రోజు ముందే ఈ నెల 31వతేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పిం ఛన్లను అందజేయాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్, టైపిస్ట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:మండలంలో సామాజిక పింఛన్‌లను శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీన ఆదివారం శెలవు దినం కావడంతో ముందు రోజే పింఛన్‌లను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు విషయాన్ని లబ్ధిదారులకు తెలపాలన్నారు.

పెద్దతిప్పసముద్రంలో:ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఈ నెల 31 శనివారం లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే వచ్చి పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో కేఎస్ బాలాజీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పీటీఎం మండల వ్యాప్తంగా వృద్ధాప్య, వికలాంగ వితంతు తదితర పెన్షన్లు కలిపి 7980 ఉన్నాయని, వారికి సెప్టెంబర్ నెలకు సంబంధించి రూ. 3కోట్ల 44లక్షల 6వేలు వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం 5గంటలకే ఇళ్ల వద్దకు వచ్చి అందిస్తారన్నారు. పెన్షన్ దారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి పంపిణీకి సహకరించాలని ఆయన కోరారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

కలకడ, ఆగస్టు 29:ఖరీఫ్‌లో వివిధ పంట లను సాగు చేసిన రైతులు పంట నమోదును ఈ-పంటలో నమోదు చేసుకోవాలని డీఏవో చంద్రానాయక్ తెలిపారు. బుధవారం ఆయన కలకడ మండలం గంగాపురం గ్రామంలో జరు గుతున్న కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడు తూ ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే ప్రభుత్వం ద్వారా ప్రయోజనాలు పొంద డానికి ఈ-పంట ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఏవో లావణ్య, సిబ్బంది పాల్గొ న్నారు.

అంతర పంటలతో వేరుశనగ పంటకు రక్షణ

పీలేరు, ఆగస్టు 29: అలసంద, అనప, కంది వంటి అంతర పంటలతో ప్రధాన పంట అయిన వేరుశనగకు రక్షణ కవచం ఏర్పడుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో) చంద్రా నాయక్ పేర్కొన్నారు. పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీలోని బోడినాయుడిదొడ్డి గ్రామంలో గురువారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంతర పంటల కారణంగా వేరుశనగకు నష్టం కలిగించే పురుగులు, తెగుళ్ల ప్రభావం గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన జీవామృతం, కషాయాల పిచికారి, నీమాస్త్రం పాటించడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు తక్కువ సాగుఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు. అదే విధంగా మండలంలోని బెట్ట భూములను సేంద్రీయ పద్ధతుల ద్వారా పచ్చగా మార్చుకోవాలని అధికారులు, రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రమణరావు, కలికిరి కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర, ఏవో రమాదేవి, ఏఈవోలు నజీర్, ఇంద్ర పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి

వాల్మీకిపురం, ఆగస్టు 29: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌బాబు ఆదేశించారు. గురువారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ నందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలిస్తూ వైద్యులు, సిబ్బంది విధుల వివరాలు ఆరా తీశారు. అనంతరం మండలంలోని చింతలవారిపల్లెలో నిర్వహిస్తున్న 104సేవలను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు జులేఖాబేగం, శ్రీవిద్య, సూపర్‌వైజర్‌లు సుధాకర్, బానుబీ, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అధిష్ఠానం చెప్పినట్లు నడుచుకోవాలి

పెద్దమండ్యం, ఆగస్టు 29: తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం చెప్పినట్లు పార్టీ నేతలు, కార్యకర్తలు నడుచుకోవాలని మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం లో గురువారం ఆయన మండల టీడీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఒకే పార్టీలో ఉండి విభేదాలు సృష్టించడం మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ నేతలు రామాంజులు నాయుడు, నారా గంగాధర, మహేశ్వర, సయ్యద్ షావలీ, సీతపతిరెడ్డి, బావాజీ, ఖాదర్‌బాషా, వెలిగల్లు రామాంజులు, మల్లికార్జున, రెడ్డిబాషా, ఇస్మాయిల్ వసీం, జావీద్, (చింటు) ఉస్మాన్ పాల్గొన్నారు.

రేపు కలికిరికి రానున్న మాజీ సీఎం కిరణ్

కలికిరి, ఆగస్టు 29: ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి శనివారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు హైదరాబాదు నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన కలికిరి నివాసానికి రానున్నట్లు ఆయన చెప్పారు. ఆది, సోమ, మంగళవారాల్లో ప్రజలకు అందుబాటులో వుంటూ స్థానికంగా ఏర్పాటు చేసే కార్యక్రమాలకు హాజరవుతారని తెలిపారు. అనంతరం 4వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి అక్కడి నుంచి విమానంలో హైదరాబాదు వెళ్ళనున్నట్లు కృష్ణప్ప వివరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

వాల్మీకిపురం, ఆగస్టు 29: సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కీర్తి పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురం పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, తదితర సీజనల్ వ్యాదుల పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ చికిత్సలు చేయించుకోవాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై డెమో ద్వారా అవగాహన కల్పించారు.